ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు

- బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాల కోసం యువత నిరీక్షణ
- నియోజకవర్గంలో భారీగా దరఖాస్తులు
- హడావుడిగా ఇంటర్వ్యూలు
- మూడు నెలలు అయినా మంజూరు కాని రుణాలు
- సన్నగిల్లుతున్న ఆశలు



కొలిమిగుండ్లలో ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు(ఫైల్)

కొలిమిగుండ్ల: బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం మొదట్లో గొప్పలు చెప్పుకొచ్చింది. జీవనోపాధి అవకాశాలు లభిస్తాయని యువత ఎంతో ఆశగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత అధికారులు హడావుడిగా ఇంటర్వ్యూలు పూర్తి చేశారు. త్వరలోనే రుణాలు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూశారు. తీరా మూడు నెలలు దాటినా ఆ ఊసే లేకుండా పోవడంతో దరఖాస్తు దారులు డీలాపడ్డారు. కూటమి ప్రభుత్వానిది అంతా ఆర్భాటం తప్ప ఆచరణలో మాత్రం శూన్యమని తేలిపోయిందని మండిపడుతున్నారు. దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు పూర్తి చేసి చాలా రోజులు అయినా అర్హుల జాబితా సిద్ధం కాకపోవడం శోచనీయం. కూటమి నాయకులు తమ అనుయాయులకే దక్కేలా జాబితాలు సిద్ధం చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వరకు వస్తాయో రావో అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

రుణాల మంజూరు కోసం బ్యాంకర్లు ఇంటర్వ్యూలు ముగించి మూడు నెలలు దాటింది. సబ్సిడీ రుణాలు ఎప్పుడు వస్తాయో తెలియని సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకపోవడమే జాప్యానికి కారణమని తెలుస్తోంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 1908 యూనిట్ల కోసం 4675 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు నుంచి ఇంటర్వ్యూల వరకు ఒక్కొక్కరు రూ.500 మేర ఖర్చు చేశారు. ఆశావాహులు రుణాలు ఎప్పుడు విడుదల చేస్తారా అని కార్యాలయాల చుట్టు ప్రదక్షిణ చేస్తున్నారు. ఇప్పటికే తీవ్ర జాప్యం చోటు చేసుకోవడంతో చాలా మంది దరఖాస్తుదారులు ఆశలు వదులుకున్నారు. కూటమి నాయకులు సిఫార్సు చేసిన వారికే రుణాలు వస్తాయనే ప్రచారం జరుగుతుండడంతో సామాన్యులకు దక్కవనే అభిప్రాయానికి వచ్చారు.

జాబితా బ్యాంక్‌లకు పంపాం

వివిధ కార్పొరేషన్‌ల సబ్సిడీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు పూర్తి కాగానే జాబితాను బ్యాంక్‌లు, ఉన్నతాధికారులకు పంపించాం. అక్కడి నుంచే మంజూరు జాబితా రావాల్సి ఉంటుంది. మా పరిధిలో పెండింగ్ ఏవి లేవు. త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి.
–ప్రసాదరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, కొలిమిగుండ్ల

నియోజకవర్గంలో యూనిట్లు, దరఖాస్తుల వివరాలు

మండలం	యూనిట్లు	దరఖాస్తులు
కొలిమిగుండ్ల	55	771
సంజామల	59	482
కోవెలకుంట్ల	55	742
అవుకు	55	772
బనగానపల్లె	80	1908

సబ్సిడీ రుణాలు వస్తే జీవనోపాధి కోసం చిన్న పాటి వ్యాపారాలు చేసుకుందామని ఆశించారు. పరిణామాలను బట్టి చూస్తే అర్హులకు అందని ద్రాక్షగా మారుతుందని దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న జ్ఞాననిధి సేవా సంస్థ సభ్యులు

బేతంచెర్ల: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను దుర్గాపేట కాలనీలో జ్ఞాన నిధి సేవా సంస్థ మంగళవారం ఘనంగా సత్కరించి బహుమతులు అందజేసింది. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు చదివి ఉన్నత లక్ష్యం చేరుకోవాలని సంస్థ సభ్యులు ఆనంద్, తిమ్మయ్య, శివ కృష్ణ అన్నారు. సమాజ సేవతో పాటు విద్య రంగానికి తమ వంతు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధుల కట్టడి



రంగాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యుడు అలీమ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో మలేరియా వస్తుందన్నారు. చలితో కూడిన జ్వరం రావడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతుందన్నారు. మలేరియా రాకుండా ఉండాలంటే ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని.. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది స్వర్ణ మంజరి, ఎంపీహెచ్ఈఓ అబ్దుల్ గఫార్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాటసాని రామిరెడ్డి

అవుకు: మండల పరిధిలోని గుండ్లశింగవరం గ్రామానికి చెందిన కాటసాని సుంకిరెడ్డి (87) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

హెచ్ఎంలకు పాఠ్య పుస్తకాల అందజేత



హెచ్ఎంలకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

కొలిమిగుండ్ల: విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో ఆయా పాఠశాలల హెచ్ఎంలకు మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో ఎంఈఓ అబ్దుల్ కలాం పాఠ్యపుస్తకాలను అందజేశారు. మొదటి, రెండు విడతల్లో 18,819 పాఠ్య పుస్తకాలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. 23,168 నోట్ బుక్‌లు, 3799 బ్యాగులు, 3788 యూనిఫారంలు వచ్చాయన్నారు. పాఠశాలల వారీగా పుస్తకాల పంపిణీ చేపట్టామన్నారు. హెచ్ఎంలు పాఠశాల పునఃప్రారంభం రోజు విద్యార్థులకు అందజేయాలని సూచించారు. మరికొన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



రంగాపురంలో వైద్యుడికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

బేతంచెర్ల: ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి రహంతుల్లా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్యుడు అబ్దుల్ అలీమ్ కు వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లకు నెలకు రూ. 26వేల వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

సెంట్రల్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పించాలి

డోన్ టౌన్: డోన్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరానికి (2025–26) ప్రవేశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామి కలెక్టర్‌కు మంగళవారం లేఖలో కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డోన్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయంలో అధికారులు, పాలకుల మధ్య సమన్వయ లోపంతో అడ్మిషన్లకు నోచుకోక విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

నేడు ఉపాధిహామీ పనులపై విచారణ

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరుగుతన్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారించేందుకు అధికారుల సిద్ధమయ్యారు. ‘మస్టర్ల మాయాజాలం’ అనే శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు విచారణ అధికారిగా డోన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారెడ్డిని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘణియా నియమించారు. బుధవారం గ్రామానికి చెరుకుని ఉపాధిహామీ పనులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతారని ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు.

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలపై వినతి

బనగానపల్లె రూరల్: సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు చందు సంఘం సభ్యులతో కలిసి మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతి గృహాల్లోని విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, పుస్తకాలు అందజేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల బిల్లులను విడుదల చేయాలని కోరారు.

కూటమి మోసాలను ఎండగడదాం

- నేడు వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ నేతల పిలుపు



డోన్: సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకే బుధవారం వెన్నుపోటు దినం పాటిస్తున్నట్లు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వాగ్దానాలను అటకెక్కించి ప్రజలను డైవర్షన్ పాలిటిక్స్‌తో మభ్యపెడుతున్న టీడీపీ నాయకుల మాటలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే ప్రభుత్వ పెన్షన్, రైతుభరోసా పెంపు లాంటి హామీలను గాలికి వదిలివేశారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి నట్టేట ముంచిందన్నారు. గతంలో కూడా పసుపు, కుంకుమ, రైతు రుణమాఫీ పేరుతో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర చంద్రబాబు ప్రభుత్వానికి ఉందన్న విషయం ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. నేడు జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు.

విజయవంతం చేయండి

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించే వెన్నుపోటు నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితో పాటు ఆయన తనయుడు బుగ్గన అర్జున్‌అమర్నాథ్‌రెడ్డి పాల్గొంటారని శ్రీరాములు తెలిపారు. విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కురుకుంద హరి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు మిట్టా రవికుమార్, పెయింటర్ వెంకటేష్, చంద్రశేఖర్, వంశీ, పాలుట్ల రఘురాం, నాగిరెడ్డి, సుంకన్న, గడ్డం సురేష్, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, ఆర్ట్ రమణ, మాజీ కౌన్సిలర్లు కాలేషా, మేకల రాజు, పెద్దయ్య, ఓబుల్‌రెడ్డి, శేఖర్ యాదవ్, రఫి పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

అవుకు: కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అవుకులో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ అమలు చేయలేదని తెలిపారు. హామీలను గాలికొదిలేసి ప్రశ్నిస్తున్న తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లెలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి అవుకు మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ప్రజలందరూ తరలిరావాలని కోరారు.



యోగాసన అభ్యాసం చేస్తున్న గీతాయోగాసన సంఘం సభ్యులు,(ఇన్‌సెట్)మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

యోగాసనం.. దివ్య ఔషధం

డోన్: నిత్యం మానసిక ఒత్తిళ్లతో అనేక రుగ్మతలకు గురవుతున్న ప్రజలకు యోగా సాధన ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గీతా యోగాసన సంఘం ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం ఉదయం యోగాసన అభ్యాసం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. మానసిక ఒత్తిడిని జయించేందుకు ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. త్వరలోనే విద్యార్థులకు యోగా సాధన పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గురూజీలు రాంపుల్లయ్య, సురేష్, న్యాయవాది నాగభూషణంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న దృశ్యం

అవుకు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవుకు ఆదర్శ పాఠశాలలో యోగా శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాస్టర్ ట్రైనర్స్ పలు రకాల ఆసనాలను వేయించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని ఎంపీడీఓ సచివాలయ సిబ్బందికి సూచించారు. డాక్టర్లు జయభారత్ రెడ్డి, నవీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైన్‌షాపులో చోరీ చేసిన దొంగ అరెస్ట్



నిందితుడు ఆలమూర్ హసన్‌తో సీఐ, పోలీసులు

బేతంచెర్ల: వైన్ షాపులో చోరీ చేసిన దొంగను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. గత నెల 25వ తేదీ స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని రమ్య వైన్స్ షాపు వెనుక భాగంలో రేకు కత్తిరించి లోనికి వెళ్లిన నిందితుడి రూ.3.99 లక్షలు అపహరించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సిమెంట్ నగర్ గ్రామంలోని కమ్యూనిటీ హాలు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న చాగలమర్రికి చెందిన ఆలమూర్ హసన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.3,71,570 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదించడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బంది సుబ్బరాయుడు, గురుబాబు, రాజు నాయక్‌లను సీఐ అభినందించారు.

రెండు రోజుల్లో పెళ్లి.. యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెకు చెందిన ఓ యువతి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన యువతి తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా బుధ, గురువారాల్లో ఈ యువతి వివాహం జరగాల్సి ఉంది.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలి మృతి

బేతంచెర్ల: ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం గోరుమానుకొండ గ్రామానికి చెందిన మంగలి లక్ష్మీదేవి(63) కొంత కాలంగా అయాసంతో బాధపడుతోంది. ఎక్కడ చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. మనస్తాపంతో సోమవారం ఉదయం పేడ రంగు ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించింది.. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బేతంచెర్లకు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి



డీటీకి వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల: మండలంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ సామాన్య, మధ్య తరగతి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

నాగన్న మృతి కార్మిక వర్గానికి లోటు

డోన్ టౌన్: కార్మిక నాయకుడు, కామ్రేడ్ బి.నాగన్న (75)మృతి కార్మికులకు తీరని లోటు అని సీఐటీయూ మండల అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ధర్మారం గ్రామానికి చెందిన కార్మిక నాయకుడు, సున్నం బట్టీల వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నాగన్న అనారోగ్యంతో సోమవారం రాత్రి కోట్లవారిపల్లెలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహంపై సీపీఎం జెండాలను ఉంచి నివాళులర్పించారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు నాగమద్దయ్య, కొండన్న, శివరామ్, ఎల్లయ్య, భాస్కర్‌రెడ్డి, నక్కి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పాలు



పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌లో వెలగటూరు బాబు ఇంట్లో మే పుష్పాలు మంగళవారం వికసించాయి. పదేళ్ల క్రితం బెంగళూరు నుంచి మొక్కలను తీసుకొచ్చి కుండీలో నాటారు. గతంలో ఏటా మే నెలలో పుష్పాలు వికసిస్తుండగా రెండేళ్ల నుంచి జూన్ నెలలో వికసిస్తున్నాయి. అలాగే పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది రమేష్ ఇంటి ఆవరణలో మే పుష్పం ఈ ఏడాది తొలిసారిగా వికసించింది.
–కోవెలకుంట్ల

వాటర్‌ప్లాంట్ మూత.. తాగునీటికి కటకట



మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను మూసివేయడంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెద్ద గ్రామాల్లో ఆకుమల్ల గ్రామం ఒకటి. సుమారు 4 వేల జనాభా ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్‌కు తాళం వేశారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్లాంట్ నిర్మాణానికి గది ఏర్పాటు చేసినా మిషనరీ సమకూర్చకపోవడంతో అలాగే ఉండిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో 2019లో ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. గ్రామంలో ఉన్న ఒకే ఒక మినరల్ ప్లాంట్ ఇదే. ఇప్పుడు రాజకీయ కక్షతో వాటర్ ప్లాంట్‌ను మూసివేయడంతో గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఆకుమల్లకు చుట్టుపక్కల పది గ్రామాల నుంచి తాగునీటికి వస్తుంటారు. ఇప్పుడు సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్వకొండ గ్రామానికి వెళ్లి ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకునిరావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమిస్తాం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు ఉద్యమిస్తామని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కొలిమిగుండ్ల: కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు సూర్యనారాయణ, వడ్డె మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ విశ్వతేజకు వినతి పత్రం అందించారు. పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కంబగిరిస్వామి, రాజు, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, దేవా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శోణ లింగేశ్వరస్వామి గుడికి కొత్త శోభ

- ఆలయ అభివృద్ధికి దాతల సహకారం
- విరాళాలతో ఆలయానికి హంగులు





జీర్ణోద్ధరణగావించిన శోణ లింగేశ్వరస్వామి ఆలయం, మామిడి, పూలమొక్కలతో కళకళలాడుతున్న ఆలయ ప్రాంగణం

కోవెలకుంట్ల: పట్టణంలోని సంస్కృత పాఠశాల ఆవరణలో వెలసిన శోణ లింగేశ్వరస్వామి ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. మల్లమరాజు సుబ్బయ్య ట్రస్టు ఆర్థిక సహకారంతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా ఉండేందుకు దాతలు సహకరించడంతో అన్ని హంగులు సంతరించుకున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు ప్రత్యేక చొరవతో ఆలయ అభివృద్ధికి బీజం పడింది. పట్టణానికి చెందిన ప్రవాసాంధ్రుడు కిషన్ యాదవ్ రూ. లక్ష, రిటైర్డ్ ఎంఈఓ గోపాల్‌రెడ్డి రూ. 50వేలతోపాటు పలువురు దాతలు అందించిన రూ. 7 లక్షలతో ఆలయ ఆవరణలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రాజమండ్రి సమీపంలోని కడియం నుంచి ఐదు రకాల మామిడి మొక్కలు, 36 రకాల పూలమొక్కలు తెప్పించి నాటారు. పండ్ల, పూలమొక్కలు నాటడంతో పచ్చటి మొక్కలతో ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామం చేసుకునేందుకు వాకింగ్ ట్రాక్, పార్కు, పిల్లలు ఆడుకునేందుకు ఉయ్యాలలు, సేద తీరేందుకు సిమెంట్ బెంచీలు, తదితర వాటిని ఏర్పాటు చేశారు. దూప, దీప నైవేద్యానికి ఉపయోగకరంగా ఉంటుందని పూలు, పండ్ల మొక్కల పెంపకం చేపట్టడంతో ఆలయ ప్రాంగణంలో పచ్చతోరణం ఉట్టిపడుతోంది.



ఆలయ ఆవరణలో ఉయ్యాలలు



సిమెంట్ బెంచీలు